క్రొన్వెంట్‌లో కొత్తగా మూడవ తరగతిలో కొడుకు రవిని జేర్పించిన సుభద్ర గర్వం అంతా యింతాకాదు. ఆదివారం మధ్యాహ్నం తీరికగా స్నేహితులతో కబుర్లు చెబుతూ, ఆ ఇంగ్లీషు మీడియమ్ కాన్వెంట్ లో సీటు దొరకడం ఎంత దుర్లభమో, తాను ఎన్ని రికమెండేషన్స్‌తో రవికి సీటు సంపాదించ గలిగిందో, ఎంత పైకం నిర్లక్ష్యంగా స్కూల్ ఫండ్ నిమిత్తం విసరి పారేసిందో గర్వంగా వివరించింది.

"ఎలా వుందిరా రవీ స్కూలు? వచ్చే ఏడు మావాడిని కూడా అందులోనే వదేస్తాను?" అన్నది ఒక ఇల్లాలు.

"అబ్బో! వచ్చే ఏటికి ఫండ్ మరీ పెరుగు తుందండీ. ఆఏటి కాయేడు పోటీ ఎక్కువే ఔతుంది. ఇంతా మనం వేలకి వేలు ఇస్తూంటే ఓథాంక్స్ కూడా లేదండీ మన ముఖాన. ఎంత గర్వం దానికి?'!

"ఎవరికీ?"

"అదే! ఆ ప్రిన్స్‌పాల్" అమ్మో దాని కళ్ళెక్కడా నేల మీద ఆనవండీ బాబూ!"

"ఔనట! విన్నాను. మనలాంటి వాళ్ళం దరం వెనుకటి రోజుల్లో అయితే ఆస్తులు వున్నాయి. చదువెందుకు?" అనుకునే వాళ్ళం. మరి ఇప్పుడు వాళ్ళూ వీళ్లూ అని లేకుండా అందరూ చదువుల కెగబడ్తూంటే 'బ్రతకలేక బడివంతుల'నే సామెత పోయి వాళ్ళూ పెద్ద ఫురానా కబుర్లు చెప్పే రోజులొచ్చాయి."

ఈసడింపుగా అనుకొన్నారు.

అందరూ ఈ అభిప్రాయాన్ని "ఔనౌను" అని బలపరిచారు.

"ఒరే. మేష్టర్లు పాఠాలెలా చెప్తున్నారూ?" ఒకామె ఆరాగా అడిగింది.

రవి గొప్పగా బదులిచ్చాడు.

"మేష్టర్లు కాదు, సర్స్. మేడమ్స్!"

"హోర్నీ! అప్పుడే ఎంతటి కబుర్లు నేర్చాడు!" అంటూ అందరూ ఆశ్చర్యాన్ని వెలిబుచ్చారు.

"ఎందర్రా నీకు రవీ ఆడ మేష్టర్లూ - అదే మేడమ్స్?"

ఇక రవికి మాట్లాడే అవకాశ మీయకుండా ఆత్రంగా రవి తల్లి ప్రారంభించింది మాటలు.

# కాన్వెంటు పర్వం!

"అయిదుగురండీ బాబూ వీడి ప్రాణానికి. ఒక్కో సబ్జెక్టుకు ఒక్కొక్కతె! మొత్తం కాన్వెంటుగో ఓ యాభై మందికి పైగానే వున్నారు లెండి.?

"అలాగా? పెద్దదేనన్నమాట సంస్థ!"

"చెప్పాను కదా చదువులెక్కువై స్కూళ్ళు పెరిగి పోతున్నాయి. ఇంతకూ చెప్పేదేమి టంటే మనం ఏ ఫేషన్ పెరేడ్‌కో వెళ్ళామేమో అనిపిస్తుందనుకోండి వాళ్ళ చీరలూ, ఆ తీరు లూను! ఒక్కొక్కతె ఎంతందంగా అలంక రించు కొస్తుందో తెలుసా?"

"నాకు తెలీకడుగుతానూ, పాఠాలు చెప్ప డానికి అంతంత అలంకరణలు దేనికండీ?"

"సత్తే. అమాత్రం అర్ధం చేసుకోలేరూ? దార్లోనో లేకుంటే స్కూల్లోనో ఏపెళ్ళికొడుకో దొరుకుతాడనీ. ఆడాళ్ళ చదువులకి ఉద్యోగా లకి అంతకంటె అర్థమేముంటుంది?"

అందరూ హాయిగా నవ్వుకున్నారు.

"మరి పెండ్లయిన వాళ్ళు కూడా అలాగే అలంకరించు కోవడంలో అర్థం?"

ఒకామె ధర్మసందేహాన్ని మరొకామె చిటికెలో తీర్చింది.

"వాళ్ళకే తెలియాలి ఎవరికోసమో?"

"నిజమేలెండి. పిల్లల హోం వర్కులూ, నోట్సులూ అన్నీ మనం చూసుకోవలసిందే. ఆ సీతాకోక చిలుక హోం వర్కు యివ్వడం, చెయ్యకపోతే కొట్టడం—అంతే కానీ ఏమీ నేర్పదట. ఇంట్రవల్‌లో కూడా ప్రైవేటు రూమ్స్‌లోకి పోయి మళ్ళా మేకప్ ఔతారట చాలా మంది."

"భేష్! ఇంకేం? మనవాడు బాగుపడినట్టే."

మళ్ళీ అందరూ పకపకా నవ్వుకున్నారు.

అధికంగా విమర్శించి ఆనందించింది సుభద్ర.

అసలు మాట్లాడక, నవ్వక మౌనంగా విన్నది లీల.

అలా వీలైనంతగా వినోదించి, రెండుసార్లు కాఫీ త్రాగి, ఎవరిళ్ళకు వారు జేరుకున్నారు సాయంత్రానికి.

లీలావతి తను దుస్తులు మార్చి, పిల్లలను కూడా మార్చమని చెపుతూ, సమాధానం రాక ఏం చేస్తున్నారో చూడడానికి వాళ్ళ గదిలోకి వెళ్ళింది.

ఆమె సంతానం — గీత, రమేష్ చాలా సీరియస్‌గా దెబ్బలాడు కుంటున్నారు.

## ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి

"ఏ టీచర్ కోతిలా వుంటుంది. దానికసలు పాఠాలు వచ్చా మనకు నేర్పటానికి?"

అని గీత అన్నదానికి రమేష్ తారాజువ్వలా లేచాడు.

"దానికీ రాదు, నీకూ రాదు. మీ ఆడాళ్ళంతా పెళ్ళికోసం చదువుతూ అలంకరించుకుంటారని అమ్మ ఫ్రెండ్స్ ఇందాక అనుకోలేదూ?"

లీలావతికి పట్టరాని ఆగ్రహంతో వుడికిపో యింది. కొట్టాలనుకుంది కానీ అంతలోనే తమాయించు కున్నది.

"ఒరే రమేష్, నేనెవర్ని?"

అంది శయ్యపై పిల్లల ప్రక్కన కూర్చుంటూ.

"అమ్మవి."

"అది సరే ఇంకా?"

రమేష్‌కు అర్థం కాలేదు.

"మదర్. మమ్మీ."

"అబ్బ. యింకా ఏమిటీ?" రమేష్ తల గోక్కున్నాడు.

''అడదాన్నిరా. నేనూ ఏమీ రాని దాన్నే కదూ?''

తల్లి అంత సూటిగా అడుగుతూంటే, పదమూడేళ్ళ రమేష్ మొదట అయోమయంగా తర్వాత గాభరాగా చూచాడు.

''నిన్నుకాదు.... మమ్మీ, టీచర్ని అంటున్నాను నేను.''

కోపంగా చెయ్యెత్తింది లీలావతి.

''ఇంకెప్పుడూ అలా అనకు. లెంపలు వేసుకో.''

''మమ్మీ!''

''ముందు సారీ చెప్పు అలా మాట్లాడినందుకు.''

తల్లి సంగతి బాగా తెలిసున్న రమేష్ వెంటనే క్షమాపణలు చెప్పుకొన్నాడు.

''అలా నాలుక చివరి మాటలు కాదు. ఏదీ దేవుడి మీద ఒట్టు పెట్టి చెప్పు?''



''అబ్బ. ఏమిటి మమ్మీ యిదంతా?''

బెదిరిపోయి ఏడ్చేశాడు రమేష్.

లీలావతి కరగలేదు కానీ రమేష్‌ను దగ్గరకు తీసుకుని చెప్పింది.

''చూడు రమేష్, ఇంట్లో వున్నంతసేపూ నేను నీ జాగ్రత్తలూ, అవసరాలూ అన్నీ చూస్తాను. మరి స్కూల్లో?''

''ఎవ్వరూ చూడరు.''

''కాదు. మీ టీచర్స్ నీకు అడుగడుగునా పాఠాలు చెబుతూ, క్రమశిక్షణ నేర్పుతారు.''

''ఔననుకో.''

''మరి ఆ టీచర్స్ నీకు అమ్మతో సమానమేగా?''

''.......''

''విను రమేష్ నువ్వు చిన్నవాడివి. ఇందాక నా స్నేహితులు మాట్లాడుకొన్నవి నిజంకాదు. వాళ్ళకు ఏమీ తెలియదు. అటువంటి వాళ్ళలాగా నువ్వు మాట్లాడకూడదు.''

''ఎందుకనీ?''

''ఎందుకా?'' టీచరే కాదు, ఏ స్త్రీ అయినా నీకు అమ్మతో,—అంటే నాతో – అక్కతో సమానం, నన్ను తిడ్తావా రేపట్నుంచి?''

రమేష్ బిక్కమొఖంతో చూచాడు. కన్నులలో నీరు.

గీత స్థితి కూడా తక్కువగా ఏమీ లేదు.

''ఏడవ కూడదు. అర్థం చేసుకోండి. అందరిలా ఆలోచన లేకుండా మాట్లాడకూడదు. టీచర్స్‌నే కాదు. ఎవ్వర్నీ ఏమీ అనకూడదు. బయటకు ఉద్యోగానికైనా, ఇంకెందుకైనా సరే వెళ్ళేవారు శుభ్రంగా, చక్కగా కన్పించాలి. టీచర్‌కి శుభ్రం లేకపోతే మీకు శుభ్రత గురించి ఎలా నేర్పుతారు? వారి ముస్తాబు గురించి మీరసలు మాట్లాడకూడదు.''

రమేష్ గీతలు ముఖా ముఖాలు చూసుకున్నారు.

''ఇంట్లో నాకెంత పని వుంటుందో చూడు. అలాగే వారికీ తమ ఇండ్లలో ఎన్నో పనులు వుంటాయికదా? అవన్నీ త్వరత్వరగా ముగించుకుని, నీట్‌గా తయారై మీకు పాఠాలు చెబుతున్నారు, అంటే మీరు ముందు ముందు మంచి చదువులు చదివి పెద్ద పెద్ద ఉద్యోగాలు చేయడానికి ఇప్పటి నుంచీ తర్ఫీదు విస్తున్నారన్నమాట. ఆవిధంగా తమ కోసం, ఇంటి కోసం చక్కగా డబ్బు కూడా సంపాదిస్తున్నారు.''

''ఔను.''

గీతా రమేష్‌లు ముక్త కంఠాలతో అన్నారు.

తల్లి మాటలూ, బోధనా పూర్తిగా నచ్చినట్లు వారి ముఖ కవళికలే చెబుతున్నాయి.

''చూడు గీతా, రేపు నువ్వూ పెద్దదానవై, ఉద్యోగం చేస్తావు. మరి అప్పుడు నువ్వూ అలా శుభ్రంగా తయారై వెళ్తావా?

సిగ్గుతో మెలికలు తిరిగిపోయింది గీత.

''మీ టీచర్స్ ఇవాళ ఎంత ఓపికగా మీకు అన్నీ నేర్పుతున్నారో, అంత ఓపికగానూ ఇంటి దగ్గర కూడా తమ వారితో వుండాలి. నీకెప్పుడైనా విసుగు, కోపం, చికాకూ, కలిగాయనుకో. నీకు నచ్చిన మేడమ్స్‌ను జ్ఞాపకం తెచ్చుకో. కోపమే ఎగిరి పోతుంది. కొత్త ఉత్సాహం వస్తుంది.''

ధ్యాంక్స్ మమ్మీ. చాలా మంచి మాటలు చెప్పావు ఇవాళ. ఇకనుంచి అసలు నీఫ్రెండ్స్ మాటలు మేము విననే వినం.''

అని ఏక కంఠంతో అన్నారు. అక్కా, తమ్ముడూ.

గీతా రమేష్‌లు ప్రతి తరగతీ ప్రథమంగా ఉత్తీర్ణులౌతూ, పదుగురి ప్రశంసలూ పొందుతూ పెద్దవారై చక్కటి ఉద్యోగాలలో కుదురుకున్నప్పుడు లీలావతి అమితంగా సంతోషించింది. గర్వపడింది.

అటు రవి ఇందుకు పూర్తిగా భిన్నంగా అల్లరి వాడుగా, ఆకతాయి వాడుగా తయారై, అటు చదివిన పాఠశాలకూ, ఇటు తలిదండ్రులకూ కూడ అవమానకరంగా తయారైనపుడు లీలావతి ఆశ్చర్యపడలేదు.

అంత మంచి స్కూళ్ళలో జేర్చి ఎంత డబ్బైనా విసరి పారేస్తూ గారాబంగా పెంచుకొన్న తన రవి ఎందుకలా హీన దశకు జారిపోయాడో సుభద్రకు మాత్రం తెలియదు.

ఆమెకు తన విలువా, తన స్త్రీజాతి విలువే తెలియవు. సుభద్ర వంటి అవివేకినులు ఎందరో మన సమాజంలో!

లీలావతిలా తన బాధ్యతనూ, ధర్మాన్ని, ప్రతి స్త్రీ గుర్తించి, పిల్లలతో మాట్లాడే ప్రతి మాటలో, వారికి సంబంధించిన ప్రతి చర్యలో కొంత జాగ్రత్త వహిస్తే రవి వంటి కులపాంసకులూ, ధర్మదూరులూ, తయారు కారనీ, సంఘస్థితి కాస్తయినా మెరుగవ వచ్చనీ ప్రతి నారీ గుర్తించాలి. [ ]